నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 6 సెప్టెంబర్ 2024 | KARIMNAGAR

## వంతెన ఇలా.. వెళ్లేదెలా?



వరదలకు ధ్వంసమైన ఇందుర్తి బ్రిడ్జి

చిగురుమామిడి, సెప్టెంబర్ 5 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చిగురుమామిడి మండలంలోని ఎల్లమ్మ వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఇందుర్తి వద్ద కోహెడ వెళ్లే ప్రధాన రహదారి బ్రిడ్జి పూర్తిగా ధ్వంసమైంది. వరద తగ్గుముఖం పట్టగా, తేలిన బ్రిడ్జిపై నుంచి వాహనదారులు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. బ్రిడ్జిపై రాళ్లు కొట్టుకుపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని, శాశ్వత పరిష్కారం కోసం హైలెవల్ వంతెన నిర్మించాలని చిగురుమామిడి, కోహెడ మండలాల ప్రజలు కోరుతున్నారు.

## సంపత్‌కుమార్‌కు జాతీయ పురస్కారం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న తాడూరి సంపత్‌కుమార్

గంభీరావుపేట, సెప్టెంబర్ 5 : దమ్మన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తాడూరి సంపత్‌కుమార్ గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించారు. భౌతిక శాస్త్రం బోధిస్తున్న సంపత్‌కుమార్ విద్యార్థులతో రూపొందించిన 53 ఆవిష్కరణలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 2024-25 కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులకు తెలంగాణ నుంచి ఇద్దరు ఎంపికవగా, అందులో సంపత్‌కుమార్ ఒకరు. కాగా, గురువారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని పొందారు.



రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు గూళ్ల అంజన్‌కుమార్, మార రమేశ్, పాకాల శంకర్‌గౌడ్, అధ్యాపకుడు ప్రమోద్ కుమార్, పశు వైద్య కళాశాల డీన్ దాసరి శ్రీనివాస్

## రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల స్వీకరణ

జగిత్యాల/ కోరుట్ల/ కమాన్‌చౌరస్తా/ సిరిసిల్ల తెలంగాణ చౌక్/ జ్యోతినగర్/ పెద్దపల్లి రూరల్, సెప్టెంబర్ 5 : రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఏడుగురు గురువారం హైదరాబాద్‌లో అవార్డులు అందుకున్నారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఆఫ్ ఎడ్యుకేషన్ బుర్ర వెంకటేశం చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసాపత్రాలతోపాటు నగదు పురస్కారాలు తీసుకున్నారు. అవార్డులు అందుకున్న వారిలో శాతవాహన యూనివర్సిటీ సోషియాలజీ డిపార్ట్‌మెంట్ హెవోడీ డాక్టర్ కే పద్మావతి, యూనివర్సిటీ పరిధిలోని ఎస్సారార్ కళాశాలలో కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బూర్ల నరేశ్, పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ టీటీఎస్ జడ్పీ హైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు గూళ్ల అంజన్‌కుమార్, సిరిసిల్ల ప్రభుత్వ బాలుర పాఠశాల సైన్స్ టీచర్ పాకాల శంకర్‌గౌడ్, పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి జడ్పీ హైస్కూల్ అసిస్టెంట్(సాంఘిక శాస్త్రం) మార రమేశ్, కోరుట్ల పట్టణంలోని పీవీ నరసింహారావు పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్, జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్ ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

## రుణమాఫీ ఏకకాలంలో చేయాల్సిందే

- అర్హులందరికీ ఎందుకు చేయలేదు? • అవసరమైతే కోర్టు మెట్లెక్కుతా.. నా హక్కులను సాధించుకుంటా
- సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను ఓడిపోయిన నాయకులు పంపిణీ చేయడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేనిచోట నిధులు మంజూరు చేయడం లేదు
- సీపీ ఇంటర్నల్ విషయాలు మానకొండూర్ ఎమ్మెల్యే బహిర్గతం చేయడమేంటో చెప్పాలి
- విలేకరుల సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, సెప్టెంబర్ 5 : రైతు రుణమాఫీ 40 శాతం మాత్రమే చేశారని, అర్హులందరికీ ఎందుకు మాఫీ చేయడం లేదో చెప్పాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ₹49 వేల కోట్లు చేయాల్సిన మాఫీని దశల వారీగా ₹17 వేల కోట్లు మాత్రమే చేశామని మంత్రులే చెబుతున్నారని, సీఎంకు, మంత్రులకు సమన్వయం లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. రైతులందరికీ ఏకకాలంలో రుణమాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. జమ్మికుంటలోని మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో సహా.. పోలీసు ఉన్నతాధికారుల ఫోన్లను ట్యాపింగ్ చేస్తున్నట్టు అనుమానాలున్నాయని, జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించి వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. మానకొండూర్ సీఐతో కరీంనగర్ సీపీ టెలీ కాన్ఫరెన్స్ మాట్లాడడం లేదని, ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే సాక్షాత్తూ మంత్రి ఇంట్లోనే విలేకరుల సమావేశంలో వెల్లడించడం ఏంటని ప్రశ్నించారు. ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారనడానికి ఇంతకంటే పెద్ద ఉదాహరణ ఏముంటుందన్నారు. పోలీసుల ఇంటర్నల్ విషయాలు ఎమ్మెల్యేకు ఎలా తెలిశాయో? చెప్పాలని నిలదీశారు. అంటే సర్కారు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, పోలీసులు అధికారులు ఏం చేస్తున్నారో? ఏం మాట్లాడుతున్నారో? ట్యాపింగ్ ద్వారా తెలుసుకుంటున్నదని ఆరోపించారు. అధికారుల పోస్టింగులు పారదర్శకంగా ఉంటాయని, బాధ్యత అంతా ఉన్నతాధికారులదేనని సీఎం చెప్పిన విషయాలను గుర్తు చేశారు. ఇప్పుడు మానకొండూర్ ఎమ్మెల్యే ఆయనే సీఐకి పోస్టింగ్ ఇప్పించినట్లు, సీపీ అతడిని పట్టించుకోవడం లేదనడం హాస్యాస్పదమన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల భద్రత కోసం పాటుపడే పోలీసులపై బురదజల్లడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి మనోభావాలు దెబ్బతీయడం సరికాదని హితవుపలికారు. మానకొండూర్ ఎమ్మెల్యే పోస్టింగులు ఇప్పించుకుంటే.. తాను కూడా ఇప్పించుకునేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు గాలికొదిలేసిన ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యేలుగా ఓడిపోయిన నాయకులతో పంపిణీ చేయడం సిగ్గుచేటని, వాళ్ల ఎమ్మెల్యేలు లేని చోట నిధులు కూడా మంజూరు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పైసా ప్రజల సొమ్మని, ప్రజల సొమ్మును వాళ్ల కోసం ఖర్చు చేసేందుకు నిధులు ఎందుకు మంజూరు చేయడం లేదో చెప్పాలన్నారు. నిధుల మంజూరు కోసం అవసరమైతే కోర్టు మెట్లెక్కుతానని, ఎమ్మెల్యేగా తన హక్కులను సాధించుకుంటానని స్పష్టం చేశారు. జమ్మికుంటలోని పెసరు బండను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని, కబ్జా చేస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రభుత్వ భూములు మన ఆస్తులని, కలెక్టర్, అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. తప్పుడు నిర్ణయాలు, నివేదికలు ఇస్తే అధికారుల నౌకర్లు పోతాయన్నారు. సమావేశంలో మున్సిపల్, పీఏసీఎస్ చైర్మన్లు రాజేశ్వర్‌రావు, సంపత్, కౌన్సిలర్లు భాస్కర్, సదానందం, రమేశ్, శ్రీనివాస్, నాయకులు రాజ్‌కుమార్, రామస్వామి, తిరుపతిరెడ్డి, వెంకటేశ్, రాజేశ్, మొగిలి, జేకే, మాణిక్యం, జమీర్, జానీ, మనోహర్‌రావు, రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ బస్టేషన్‌లో భద్రత కరువు!



కరీంనగర్ బస్టేషన్‌లో ప్రయాణికులు

- కొన్ని నెలలుగా పెరుగుతున్న దొంగతనాలు
- సీసీ కెమెరాలు అంతంతే
- మండిడుతున్న ప్రయాణికులు
- రక్షణ కల్పించాలని డిమాండ్

**కరీంనగర్ బస్టేషన్‌లో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. సంస్థ నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేమితో ప్రయాణికులకు రక్షణ కరువవుతున్నది. రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద స్టేషన్‌లో నిర్వహణ సరిగ్గా లేక కొన్ని నెలలుగా దొంగతనాలు పెరుగుతున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది కొరత, సీసీ కెమెరాలు అంతంతే ఉండడం, కొద్దిరోజుల క్రితం కమాండ్ కంట్రోల్ డెస్క్ ఎత్తేయడం అందుకు కారణాలుగా కనిపిస్తున్నాయి.**




బస్టాండ్‌లోని కమాండ్ కంట్రోల్ అండ్ పోలీస్ హెల్ప్ డెస్క్‌ను ఎత్తివేయడంతో ఖాళీ ఉన్న గది

కరీంనగర్ తెలంగాణ చౌక్, సెప్టెంబర్ 5: కరీంనగర్ బస్టేషన్ రాష్ట్రంలోనే రెండో అతి పెద్దది. ఇక్కడ 49 ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. కరీంనగర్ రీజియన్‌తోపాటు వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ రీజియన్ పరిధిలోని 20 డిపోలకు చెందిన 1850 బస్సులు నిత్యం లక్ష మంది ప్రయాణికులను రాష్ట్ర నలుమూలలకు చేరవేస్తుంటాయి. అయితే ఈ బస్టేషన్, కొన్ని నెలలుగా భద్రతాలోపంతో సతమతమవుతున్నది. గతేడాది డిసెంబర్ ముందు వరకు ఇక్కడి నుంచి ప్రతి రోజూ 60వేల మంది ప్రయాణించినా.. కాంగ్రెస్ సర్కారు మహాలక్ష్మి పథకంతో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. అయితే ఇదే అదనుగా దొంగలు రెచ్చిపోతున్నారు. బ్యాగ్‌లు, బంగారు గొలుసులు, సెల్ ఫోన్లను కొట్టేస్తున్నారు. ఆగస్టు ఒక్క నెలలోనే 15 దొంగతనాలు జరగడం పరిస్థితికి అద్దంపడుతున్నది.

### కమాండ్ కంట్రోల్ డెస్క్, సెక్యూరిటీ సిబ్బంది ఎక్కడ?

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రయాణికుల భద్రతకు అనేక చర్యలు తీసుకున్నది. స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా బస్టేషన్‌లో 46 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వన్ టౌన్‌కు చెందిన ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుల్స్‌తో బస్టాండ్ ఆవరణలో కమాండ్ కంట్రోల్ పోలీసు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయగా, వారు మూడు షిఫ్ట్‌ల్లో 24 గంటల పాటు పర్యవేక్షించేవారు. అయితే ఆరు నెలలుగా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో అదే సమయంలోనే హెల్ప్ డెస్క్‌ను ఎత్తేశారు. పోలీసులను ఇతర విధులకు కేటాయించారు. అయితే గత నెలలో సీసీ కెమెరాలు మరమ్మతులు చేయించినప్పటికీ రద్దీ పెరగడంతో నిఘాకు సరిపోవడం లేదు. సుమారు 88 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే భద్రత పటిష్టంగా ఉంటుందని సెక్యూరిటీ అధికారులు చెబుతున్నారు. ఇదే టైంలో సెక్యూరిటీ సిబ్బంది నియామకం సైతం పూర్తిస్థాయిలో లేకపోవడం మరో కారణంగా కనిపిస్తున్నది. షిఫ్ట్‌కు పది మంది పని చేయాల్సి ఉండగా కేవలం ఏడుగురు మాత్రమే పనిచేస్తున్నారు. ఇప్పటికైనా డిపో అధికారులు స్పందించి, బస్టేషన్‌లో సీసీ కెమెరాల సంఖ్యను పెంచాలని, సరిపడా సెక్యూరిటీ సిబ్బందిని నియమించి, ప్రత్యేక పోలీసు ఔట్‌పోస్టును సైతం ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండ్‌లో సీసీ కెమెరా

### పటిష్ట భద్రత కల్పిస్తున్నాం

బస్టేషన్‌లో ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. సీసీ కెమెరాలతో నిఘా కట్టుదిట్టం చేశాం. గతంలో ఉన్న పోలీసు కంట్రోల్ డెస్క్‌ను పోలీసులు ఎత్తేశారు. అయితే ప్రస్తుత సీసీ కెమెరాల బాధ్యతలను ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బందికే అప్పగిస్తాం. 24 గంటల పాటు పర్యవేక్షణ ఉండేలా చూస్తాం. ఆర్ఎం కార్యాలయంతో పాటు డిప్యూటీ ఆర్ఎం,సెక్యూరిటీ అధికారుల కార్యాలయాలకు అనుసంధానిస్తాం.

- సుచరిత, కరీంనగర్ ఆర్ఎం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పక్కన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

## నియోజకవర్గంలో అరాచక పాలన

- కమీషన్లు, పైరవీల రాజ్యమా? • 'కవ్వంపల్లి' ఇప్పటికైనా పద్ధతి మార్చుకో.. • ప్రజా సమస్యలపై దృష్టి సారించు • దళిత ఎమ్మెల్యేనని చెప్పుకుంటూ దళితజాతిని అవమానపరుస్తావా..?
- భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఏం చేస్తున్నవ్
- మానకొండూర్ ఎమ్మెల్యేపై మాజీ ఎమ్మెల్యే రసమయి ఫైర్

మానకొండూర్, సెప్టెంబర్ 5:' కవ్వంపల్లి సత్యనారాయణ ఏదో చేస్తాడని ఎమ్మెల్యేగా గెలిపిస్తే మానకొండూర్ నియోజకవర్గంలో కమీషన్లు, పైరవీల రాజ్యం, అరాచక పాలన నడుస్తున్నదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి మండల కేంద్రంలోని గడిమహల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలో తీవ్రనష్టం జరిగిందని, కల్వర్టులు తెగిపోయి రోడ్లు ధ్వంసమవడంతో కొన్ని గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయని చెప్పారు. బెజ్జంకి మండలం తోటపల్లిలో ఒక నిరుపేద మత్స్యకారుడు చేపల వేటకు వెళ్లి గల్లంతయితే ఇప్పటివరకు ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే కానీ, ఏ ఒక్క అధికారైనా పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. భారీ వర్షాలకు నియోజకవర్గం అతలాకుతలమైతే అధికారులతో సమీక్షించి నష్ట నివారణ చర్యలు చేపట్టాల్సిన ఎమ్మెల్యే కవ్వంపల్లి, నియోజకవర్గాన్ని వదిలి పత్తాలేకుండా హైదరాబాద్ పోయి సెక్రటేరియట్‌లో పైరవీలు చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఆయనకు అనుకూలంగా తహసీల్దార్, ఎంపీడీవో, సీఐ, ఎస్ఐలకు పోస్టింగులు ఇప్పించుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వర్షాలకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు నిధుల కోసం సీఎం వద్దకు వెళ్లి చర్చిస్తే బాగుంటుందని, కానీ ఆయన పోస్టింగ్ ఇప్పించిన ఒక సీఐని పోలీస్ కమిషనర్ ఇబ్బందులు పెడుతున్నారని, పట్టించుకోవడం లేదంటూ ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందని, ఇది అతని అవివేకానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఒక సీఐ విషయంలో ఎమ్మెల్యే సీఎం వద్దకు పోయి ముక్కుసూటిగా వ్యవహరించే సీపీపై ఫిర్యాదు చేయడం సిగ్గుచేటన్నారు. దళిత ఎమ్మెల్యే అయి ఉండి దళిత జాతి ఆత్మ గౌరవాన్ని కవ్వంపల్లి దెబ్బతీస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు రుణమాఫీ పూర్తిగా జరుగలేదని, రైతుబంధు, రైతుబీమా ఊసే లేదన్నారు. కవ్వంపల్లి అనుచరుల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, గ్రామాల్లో కనీసం ఒక పాన్ డబ్బా పెట్టుకోవాలన్న కమీషన్ ఇవ్వనిదే పని కావడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే ఎన్నికల్లో ప్రజలు, రైతులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు. ఇక్కడ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్ గౌడ్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్వై నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరు సురేష్, మానకొండూర్ సింగిల్ విండో చైర్మన్ నల్ల గోవిందరెడ్డి, నాయకులు రామంచ గోపాల్‌రెడ్డి, ఎరుకల శ్రీనివాస్ గౌడ్, పిట్టల మధు, సాదవేణి రాజుయాదవ్, శాతరాజు యాదగిరి, దండబోయిన శేఖర్, కొట్టె రఘు, బోడ రాజశేఖర్, గోపుఈశ్వర్ రెడ్డి, ముల్కల కరుణాకర్ గౌడ్ పాల్గొన్నారు.



జిల్లా వైద్యాధికారి డా.వసంతరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

## ఆశ కార్యకర్తలకు కనీస వేతనం అందించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబర్ 5: ఆశ కార్యకర్తలను ప ర్మనెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు అం దించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశా రు. ఈ మేరకు గురువారం ఆశ యూనియన్ సీఐటీయూ ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా జిల్లాలో ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని జిల్లా వైద్యాధికారి వసంతరావు, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం కోడం రమణ మాట్లాడుతూ, గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ప్రజల ఆరోగ్యాలను కాపాడడానికి ఆశ కార్యకర్తలు అనేక సేవలందిస్తున్నారని తెలిపారు. ఆశ కార్యకర్తలకు కనీస వేతనాలు అమలు చేస్తూ పీఎఫ్, ఈఎస్ఐ, ఆరోగ్య, ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఇప్పటికైనా జిల్లాలో ఆశ కార్యకర్తలకు రావాల్సిన అన్ని రకాల పెండింగ్ బిల్లులను అందించాలని లేకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బదవేని మంజుల, కస్తూరి, రేణుక, పద్మ, జమున, సునీత, స్వప్న తదితరులున్నారు.

## ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి



కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌తో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్ • ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 5 : ఉపాధ్యాయులు మార్గ నిర్దేశకులని, సమాజంలో వారి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కొనియాడారు. విద్యార్థులకు తల్లిదండ్రుల కంటే గురువుతోనే ఎక్కువ అనుబంధం ఉంటుందని పేర్కొన్నారు. గురువుల సూచనలు పాటించి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు ఇంటిలో కంటే పాఠశాలలోనే ఎక్కువ సమయం గడుపుతారని తద్వారా గురువుతో అనుబంధం పెరుగుతుందన్నారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, పిల్లలందరూ పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు వారి సొంత డబ్బులతో పిల్లలకు ఐడీ కార్డులు, టై, బెల్ట్ వంటి వస్తువులు కొనిస్తున్నారని, పాఠశాలలోని చిన్నచిన్న మరమ్మతులు చేయిస్తున్నారని, వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. అనంతరం జిల్లాలోని 44 మంది ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

### మెరుగైన డ్రైనేజీ వ్యవస్థతో వరద నీరు ఆగలే


వారం రోజులుగా వర్షాల కారణంగా పలు జిల్లాల వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కానీ, కరీంనగర్ వాసులు మాత్రం ప్రశాంతంగా ఉన్నారని గంగుల కమలాకర్ పేర్కొన్నారు. దీనికి గత ప్రభుత్వం ఆధ్వర్యంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చడం ప్రధాన కారణమన్నారు. గతంలో వర్షం పడితే ఎక్కడ నీరు ఆగుతుందోనని భయం ఉండేదని, కానీ బీఆర్‌ఎస్ హయాంలో ఆ సమస్యలను పరిష్కరించుకున్నామని గర్వంగా చెప్పారు.

## చెత్తబండి.. బురదలో దిగబడి



డంప్ యార్డు వద్ద బురదలో కూరుకుపోయిన ఆటో ట్రాలీ

కోల్‌సిటీ, సెప్టెంబర్ 5 : ఇటీవలి వర్షాలకు గోదావరిఖని శివారులోని గోదావరి సమీపంలోని డంప్ యార్డు బురదమయంగా మారింది. గురువారం వివిధ ప్రాంతాల నుంచి చెత్తను తీసుకవెళ్లిన వాహనాలు ఆ బురదలోనే కూరుకుపోయాయి. దీంతో రామగుండం నగర పాలక సంస్థ పారిశుధ్య విభాగంలోని వాహన డ్రైవర్లు నానా తంటాలు పడ్డారు. గంటలపాటు ఆ బురదలో చెత్తకుప్పల మధ్య నరకయాతన అనుభవించారు. కూరుకుపోయిన వాహనాలు బయటకు రావాలంటే సగం డీజిల్ ఇక్కడే అయిపోతుందని, ఇప్పటికే తమకు డీజిల్ తగ్గించి పోస్తున్నారని దీంతో తాము చాలా నష్టపోతున్నామని, తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు.



బోయినపల్లి : కళకళలాడుతున్న మాన్వాడ ఎస్ఆర్ఆర్ జలాశయం

## ప్రాజెక్టులకు వరద

పెద్దపల్లి, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ)/తిమ్మాపూర్/బోయినపల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులకు వరద పోటెత్తుతున్నది. మరోవైపు గోదావరి ఉగ్రరూపం దాల్చింది. పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లి బరాజ్‌కు గురువారం రాత్రి వరకు 2,19,051 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. దీంతో అప్రమత్తమైన యంత్రాంగం ప్రాజెక్టు 62 గేట్లలో 32 గేట్లను ఎత్తి 1,62,940 క్యూసెక్కులు దిగువన సరస్వతీ బరాజ్‌కు వదులుతున్నారు. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం శ్రీరాజరాజేశ్వర జలాశయానికి సిరిసిల్ల మానేరు, వేములవాడ మూలవాగు, ఎస్సారెస్పీ వరద కాలువ నుంచి 16,550 క్యూసెక్కులు వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. 27.5టీఎంసీల సామర్థ్యం ఉన్న మధ్యమానేరు ప్రస్తుతం 22.84 టీఎంసీల సామర్థ్యానికి చేరింది. కరీంనగర్ జిల్లాలో మోయతుమ్మెద వాగు, ఇతర వాగు, శ్రీరాజరాజేశ్వర జలాశయం ద్వారా మొత్తంగా 7,546 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఎల్ఎండీ రిజర్వాయర్‌కు వస్తున్నది. 24 టీఎంసీల సామర్థ్యమున్న ఎల్ఎండీ ప్రస్తుతం 19.76 టీఎంసీలకు చేరుకున్నది.